23032024-MAI-04_Layout 1 3/23/2024 1:19 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

దక్షిణాదిపై కమలం దండయాత్ర

పూర్వం రాజులు అశ్వమేధ యాగం చేసి ఒక్కో రాజ్యంపై దండెత్తినట్టు.. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రస్తుతం ఒక్కో ప్రాంతంపై దండయాత్ర చేస్తున్నది. ఉత్తరాదిపై పట్టు సాధించిన ఆ పార్టీ ఇప్పుడు దక్షిణాదిని జయించేందుకు సకల ప్రయత్నాలు చేస్తున్నది. ఓట్ల ద్వారానే కాదు, చివరకు పార్టీలను చీల్చడం, నేతలను అరెస్టు చేయించడం.. ఇలా విజయం కోసం ఆ పార్టీ చేయని ప్రయత్నమంటూ లేదు. ఏ ఒక్క అవకాశాన్ని కమలనాథులు వదలడం లేదు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన కొత్తలో ఢిల్లీలో ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఆ సమావేశంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఎదురుపడితే కరచాలనం చేయడానికి కూడా ఇష్టపడకుండా మోదీ ముందుకువెళ్లిపోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. ఆ సన్నివేశాన్ని టీవీల్లో చూసినవారికి ప్రధాని పగ ఎలా ఉంటుందో ఇప్పుడు అర్థమై ఉంటుంది. ఢిల్లీ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు మోదీ ప్రభుత్వం మొదటి నుంచీ శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉంది. కేజ్రీవాల్ సర్కార్‌ను ఓవైపు కేంద్రం, మరోవైపు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అడుగడుగునా ఇబ్బందులకు గురిచేశారు. చివరకు దేవతా వస్త్రాలు లాంటి మద్యం కేసులో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. ఢిల్లీ ఉప ముఖ్యమంత్రిని, మంత్రిని గతంలోనే అరెస్ట్ చేసిన విషయం విదితమే.

బుద్ధా మురళి

అరెస్టుల పర్వం మొదలై రెండేండ్లవుతున్నా అసలు ఆ మద్యం స్కాం ఏమిటో, ఎవరు, ఏం నేరం చేశారో ఇప్పటివరకు ఈడీ నిరూపించలేదు. ఇతర పార్టీల్లో ఉన్న నాయకులపై బీజేపీ గతంలో తీవ్రమైన ఆరోపణలు చేసి.. ఈడీతో దాడులు చేయించింది. వారంతా బీజేపీలో చేరగానే పవిత్రులు అయిపోయారు. అదానీ అక్రమాలపై అమెరికా కోర్టు విచారిస్తున్నది. కానీ మన దేశ ప్రభుత్వం మాత్రం అదానీకి అండగా నిలుస్తున్నది. కేజ్రీవాల్ అరెస్ట్ కావడం, అదానీకి బీజేపీ అండగా నిలవడం చూస్తుంటే ప్రభుత్వం, మన వ్యవస్థలు ఎంత నిజాయితీగా పనిచేస్తున్నాయో అర్థం అవుతున్నది. ఐదు దశాబ్దాలు కావస్తున్నా ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ నీలి నీడలు అంటూ ఏటా తద్దినం వ్యాసాలు రాసే మీడియా.. తమకు నచ్చని ప్రభుత్వాలను కూల్చడం, పార్టీలను చీల్చడం, ముఖ్యమంత్రులను సైతం అరెస్ట్ చేయించడంపై నోరు మెదపడం లేదు. దేశాన్ని ఢిల్లీ కేంద్రంగా బీజేపీ పాలిస్తుంటే.. ఢిల్లీలో కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ ప్రభుత్వం ఉండటం బీజేపీకి కంటగింపుగా మారినట్టుంది. అందుకే మద్యం కేసు పేరుతో ఆప్‌ను ఎన్నికలకు ముందే చెల్లాచెదురు చేయాలనేది బీజేపీ వ్యూహంగా కనిపిస్తున్నది. ఎన్నికలను జైలులో ఉండి కేజ్రీవాల్ ఎలా ఎదుర్కొంటారో, ప్రజలు ఎలా స్పందిస్తారో చూడాలి.

ఉత్తరాదిన, ముఖ్యంగా హిందీ రాష్ట్రాల్లో బాగా విస్తరించిన బీజేపీ ఈసారి ప్రధానంగా దక్షిణాదిపై దృష్టి సారించింది. ఈ ఎన్నికల్లో దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేసి 50-60 సీట్లు సాధించాలనే లక్ష్యంతో బీజేపీ పని చేస్తున్నది. గతంతో పోలిస్తే ఈసారి దక్షిణాదిపై బీజేపీ ఎక్కువగానే ఆశలు పెట్టుకున్నది. అందుకు తగ్గట్టుగా వ్యూహాలు రచిస్తున్నది. కొంతమేరకు కమలం ప్రభావం చూపే సూచనలు కనిపిస్తున్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణాదిని అద్భుతంగా అభివృద్ధి చేసిందా? భారీ ప్రాజెక్టులను దక్షిణాదికి మంజూరు చేసిందా? అంటే అదేమీ లేదు. గుజరాత్‌పై తప్ప ఏ రాష్ట్రంపై కూడా బీజేపీ నుంచి అలాంటి అభిమానాన్ని ఆశించలేం. దక్షిణాది రాష్ట్రాల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులను బీజేపీ తనకు అనుకూలంగా వాడుకుంటున్నది. దక్షిణాదిలోని ప్రతి సీటును బీజేపీ కీలకంగానే భావిస్తున్నది. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసైతో హడావుడిగా రాజీనామా చేయించడమే అందుకు ఉదాహరణ. తెలంగాణ గవర్నర్‌గా ఉన్నప్పుడు తమిళిసై పరోక్షంగా బీజేపీ నాయకురాలిగానే వ్యవహరించారు. ఒక చానల్ ఇంటర్వ్యూలో 'మా పార్టీ వాళ్లు' అని ఆమె చెబితే, ఆ ఇంటర్వ్యూ చేసే వ్యక్తి 'మీ మాజీ పార్టీ వాళ్లు' అని ఆమె వ్యాఖ్యలను సవరించారు. గవర్నర్‌గా ఆమె ఒక ఎజెండా ప్రకారమే పని చేశారని చెప్పవచ్చు.

> గవర్నర్ కోటాలో మండలి సభ్యుడిగా దాసోజు శ్రవణ్ పేరును బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తే.. రాజకీయ నేపథ్యం ఉందనే కారణంతో దాన్ని అప్పట్లో గవర్నర్ తిరస్కరించారు. కానీ, ఒక పార్టీకి అధ్యక్షునిగా ఉన్న కోదండరాం పేరును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించగా.. ఆమె ఆమోదించారు. ఇది దేనికి సంకేతం? బీఆర్ఎస్ ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు సృష్టించి, పరోక్షంగా బీజేపీ నాయకురాలిగా వ్యవహరించినందుకే తమిళిసైకి బీజేపీ టికెట్ ఇచ్చినట్టుంది. సాధారణంగా తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీల మధ్యనే పోటీ ఉంటుంది. కానీ, ప్రతి సీటు ముఖ్యమేనని భావిస్తుండటంతో తమిళి సైని కూడా ఎన్నికల బరిలో నిలిపింది బీజేపీ నాయకత్వం.

దక్షిణాదిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరితో కలిపి మొత్తం 127 ఎంపీ సీట్లు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వీటిలో బీజేపీ 29 స్థానాలను గెలుచుకున్నది. వాటిలో కర్ణాటకలోనివే 25 కావడం గమనార్హం. తెలంగాణ నుంచి ఆ పార్టీకి చెందిన నలుగురు ఎంపీలు గెలుపొందారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. కానీ, ఈ సారి దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లోనూ అత్యధిక స్థానాల్లో గెలవాలనే లక్ష్యంతో ఒక ప్రణాళిక ప్రకారం బీజేపీ ముందుకువెళ్తున్నది. 'కాంగ్రెస్ ముక్త్ భారత్' అనేది బీజేపీ నినాదం. దేశానికి బీజేపీ ప్రమాదకరమనేది కాంగ్రెస్ వాదన. ఢిల్లీలో కుస్తీ పట్టే ఈ పార్టీలు గల్లీలో మాత్రం దోస్తీ చేస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, కమలం పార్టీల మధ్య అలౌకిక బంధం కనిపిస్తుండటమే అందుకు నిదర్శనం. పురపాలికలు, కార్పొరేషన్లలో అవిశ్వాస తీర్మానం సందర్భంగా ఆ బంధం బహిర్గతమవుతున్నది. మండల, గ్రామ స్థాయిలో రెండు పార్టీల బంధం బహిరంగంగానే సాగుతున్నా.. రాష్ట్ర స్థాయిలో కనిపించి కనిపించకుండా ఉండటం గమనార్హం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలే అయినా గవర్నర్ తమిళి సై బీఆర్ఎస్ పట్ల ఎలా వ్యతిరేకత చూపారు, కాంగ్రెస్ పట్ల ఎలా సానుకూలంగా వ్యవహరించారనేది దాసోజు శ్రవణ్, కోదండరాంరెడ్డి ఎన్నిక వ్యవహారం ద్వారా తెలిసివచ్చింది. గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్, బీజేపీల ఉమ్మడి శత్రువు బీఆర్ఎస్. కాబట్టి ఆ రెండు పార్టీల మధ్య కింది స్థాయిలోనూ అనధికారిక బంధం కొనసాగింది. పార్లమెంట్ ఎన్నికలకు సైతం ఈ రెండు పార్టీలు బీఆర్ఎస్‌నే తమ ఉమ్మడి శత్రువుగా భావిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో తమ ప్రభుత్వం కొలువుదీరుతుందని బీజేపీ నాయకులు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు. అయితే పార్లమెంట్ ఎన్నికల వరకు రెండు పార్టీల బంధం అలానే కొనసాగినా ఎన్నికల తర్వాత రాజకీయం మారుతుంది. ఈసారి తెలంగాణలో 12 సీట్లు గెలుస్తామని బీజేపీ నాయకులు చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తెలంగాణాలో బీజేపీకి కలిసివచ్చింది. అందుకే వారు ఈ తరహా ప్రకటనలు చేస్తున్నారు.

> గతంతో పోలిస్తే ఈ ఎన్నికల సందర్భంగా మోదీ దక్షిణాదిలో ఎక్కువగా పర్యటిస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలో తెలంగాణలో మోదీ రెండుసార్లు పర్యటించారు. రోడ్‌షోలు నిర్వహించారు. అదేవిధంగా కేరళలో కూడా పర్యటించారు. తమిళనాడులో ఆలయాలను సందర్శించారు. కేరళలో ప్రధానంగా సీపీఎం నాయకత్వంలోని ఎల్‌డీఎఫ్, కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్‌ల మధ్య ప్రధాన పోటీ ఉంటుంది. కానీ, ఈసారి బీజేపీ దాన్ని త్రిముఖ పోటీగా మార్చాలని ప్రయత్నిస్తున్నది.

2014లో తమిళనాడులో బీజేపీ, పీఎంకే కలిసి పోటీ చేసి చెరో సీటు సాధించాయి. 2014లో తమిళనాడులో బీజేపీకి 5.5 శాతం ఓట్లు రాగా, 2019లో ఓటింగ్ శాతం 3.66కు పడిపోయింది. గత ఎన్నికల్లో ఆ రాష్ట్రంలో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదు. కానీ, ఈ సారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో సీట్లు కూడా సాధిస్తామని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

దక్షిణాది మొత్తంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు విచిత్రంగా ఉన్నాయి. ఈ రాష్ట్రంలో 2019లో బీజేపీ ఒక్క సీటు గెలవలేదు, 2024లో కూడా ఒక్క సీటు గెలిచే అవకాశం కనిపించడం లేదు. అయితే ఒక్క సీటు గెలవకపోయినా రాష్ట్రంలోని మొత్తం 25 సీట్లు బీజేపీ ఖాతాలోనే వచ్చి పడతాయి.

> బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు నాయుడు రెండేండ్ల పాటు తీవ్రంగా ప్రయత్నించారు. పవన్ కళ్యాణ్ వెంటపడి మరి బీజేపీని ఒప్పించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సభలో మోదీ మాట్లాడినా.. ఇటు చంద్రబాబును మెచ్చుకోలేదు, అటు జగన్‌ను విమర్శించలేదు. బీజేపీకి టీడీపీతో బహిరంగ పొత్తు ఉండగా జగన్‌తో రహస్య స్నేహం ఉంది. దీనివల్ల ఆంధ్రాలో ఏ పార్టీ గెలిచినా 25 సీట్లు బీజేపీ కూటమి ఖాతాలోనే పడతాయనడంలో సందేహం లేదు.

గతంలో కర్ణాటక ద్వారా దక్షిణాదిలో బీజేపీ అడుగుపెట్టింది. కర్ణాటకలో 28 స్థానాలు ఉండగా గత ఎన్నికల్లో ఆ పార్టీ 25 గెలిచింది. ఏడాది కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ విజయం సాధించింది. ఈ ఏడాది కాలంలో రాజకీయాల్లో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. కాబట్టి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ హవా ఉండొచ్చనే వాదన బలంగా వినిపిస్తున్నది. కర్ణాటకలో బీజేపీకి తన సొంత బలంతో పాటు కాంగ్రెస్ బలహీనత తోడైంది. దాంతో 2019 కంటే ఎక్కువ సీట్లు గెలుస్తామనే ధీమాతో బీజేపీ ఉంది.

పశ్చిమ బెంగాల్‌లో సైతం బీజేపీ గణనీయమైన సీట్లు సాధిస్తామని భావిస్తున్నది. కొన్ని దశాబ్దాల పాటు ఎర్రజెండా కింద ఉన్న పశ్చిమ బెంగాల్‌లో కాషాయ జెండా రెపరెపలాడటం భారత రాజకీయాల్లో ఒక ఆసక్తికర అంశం. బెంగాల్‌ను మూడు దశాబ్దాల పాటు పాలించిన ఎర్ర పార్టీకి శాసనసభలో ప్రాతినిధ్యమే లేకపోవడం విచిత్రం. అయితే పార్లమెంట్ ఎన్నికల్లో కాషాయ పార్టీ మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుంటుందనే అంచనా మరింత ఆసక్తి కలిగిస్తున్నది. ఉత్తరాది సంగతి అలా ఉంచితే ప్రాంతీయ ఆకాంక్షలకు పెద్దపీట వేసే దక్షిణాదిలో మాత్రం కమలం వికసించడం అంత సులువు కాదు.



రాజకీయాల్లోకి రాజ్యాంగ అధికారులా?

ఇటీవల కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమబెంగాల్ కు చెందిన ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి తమ పదవులకు రాజీనామా చేసి రాజకీయ పార్టీల్లో చేరారు. తాజాగా తెలంగాణ గవర్నర్ తమిళిసై తన పదవికి రాజీనామా చేసి తమిళనాడులో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తరపున పోటీ చేయనున్నారు. దీంతో స్వతంత్ర రాజ్యాంగాధికారులు, ఇతర సీనియర్ ప్రభుత్వ అధికారులు పదవి నుంచి వైదొలిగిన తర్వాత రాజకీయ పార్టీల్లో చేరడంపై మరోసారి సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

స్వామి ఆర్వీవీయస్

వివిధ విభాగాల మధ్య నియంత్రణలు, సమతుల్యతల సూత్రంపై రాజ్యాంగం పనిచేస్తుంది. శాసనసభకు కార్యనిర్వాహక వర్గం జవాబుదారీగా ఉంటుంది. రాజ్యంలోని ఈ రెండు శాఖలను స్వతంత్ర న్యాయవ్యవస్థ పర్యవేక్షిస్తుంది. ఎన్నికల కమిషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వంటి ఇతర స్వతంత్ర సంస్థలు కూడా ప్రభుత్వ జోక్యం లేకుండా తమ రాజ్యాంగ విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. నిర్ణీత కాలపరిమితి, ఆర్థిక స్వాతంత్ర్యం, కఠినమైన తొలగింపు విధానం, పదవి నుంచి వైదొలిగిన తర్వాత ఆంక్షల ద్వారా ఈ సంస్థల స్వతంత్రతను నిర్ధారిస్తారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవి నుంచి వైదొలిగిన తర్వాత భారతదేశంలోని ఏ కోర్టు లేదా అథారిటీ ముందు న్యాయవాదిగా హాజరు కాలేరు. హైకోర్టు న్యాయమూర్తికి కూడా ఇలాంటి ఆంక్షలు ఉంటాయి. కాగ్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్/సభ్యులు పదవీ విరమణ చేసిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మరే ఇతర పనులు చేపట్టడానికి వీల్లేదు. పదవీ విరమణ అనంతర ప్రయోజనాలు పొందాలనే ఉద్దేశంతో అధికారంలో ఉన్న ప్రభుత్వం పట్ల ఇలాంటి పదవుల్లో ఉన్న సమయంలో పక్షపాతం చూపకుండా ఉండేందుకు ఈ ఆంక్షలు విధించారు.

రాజకీయ పార్టీల్లో చేరడం, ఎన్నికల్లో పోటీ చేయడం, కొన్ని పదవులకు నామినేట్ కావడం వంటి విషయాల్లో ఎలాంటి ఆంక్షలు లేవు. స్వతంత్ర రాజ్యాంగ పదవులు నిర్వహించి, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చినవారు లేదా వివిధ పదవులకు నామినేట్ అయిన సందర్భాలు ఉన్నాయి. 1967, రాష్ట్రపతి ఎన్నికల్లో పోటీచేసేందుకు, 1983లో రాజ్యసభ బరిల నిలిచేందుకు ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తమ పదవులకు రాజీనామా చేశారు. మరో సుప్రీంకోర్టు న్యాయమూర్తి 1999లో పదవీ విరమణ చేసిన ఐదేండ్ల తర్వాత తమిళనాడులోని ఓ రాజకీయ పార్టీలో చేరి ఎన్నికల్లో పోటీ చేశారు. మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ పదవీ విరమణ చేసిన మూడేండ్ల తర్వాత 2004లో రాజ్యసభ సభ్యుడిగా, మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2020లో సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ పదవీ విరమణ చేసిన నాలుగు నెలల్లోనే రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రిటైర్డ్ కాగ్‌ను, న్యాయమూర్తులను రాష్ట్రాల గవర్నర్లుగా నియమించిన సందర్భాలు కూడా ఉన్నాయి. పలువురు బ్యూరోక్రాట్లు కూడా ఉద్యోగానికి రాజీనామా చేసిన తర్వాత లేదా పదవీ విరమణ చేసిన వెంటనే రాజకీయ పార్టీల్లో చేరి ఎన్నికల్లో పోటీ చేశారు.

పదవీ విరమణ చేసిన ఉన్నతాధికారులు రాజకీయ పార్టీల్లో చేరి ఎన్నికల్లో పోటీ చేయడానికి ముందు వారికి కూలింగ్ ఆఫ్ పీరియడ్ ఉండాలని 2012లో కేంద్ర ప్రభుత్వానికి ఎన్నికల సంఘం సిఫారసు చేసింది. అయితే ఇది రాజ్యాంగ నిబంధనలకు, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా కాదన్న అటార్నీ జనరల్ అభిప్రాయం మేరకు కేంద్రం ఈ సిఫారసును తిరస్కరించింది. రాజకీయాల్లోకి రాకముందు రిటైర్డ్ బ్యూరోక్రాట్లకు కూలింగ్ ఆఫ్ పీరియడ్ విధించే చట్టాన్ని రూపొందించేలా పార్లమెంటును ఆదేశించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు 2022 మేలో కొట్టివేసింది. పదవీ విరమణ తర్వాత రాజకీయాల్లోకి వచ్చే ముందు బ్యూరోక్రాట్లకు కూలింగ్ ఆఫ్ పీరియడ్ అవసరమా లేదా అనేది పార్లమెంటు నిర్ణయిస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది.

ప్రజాస్వామ్యం యొక్క ముఖ్యమైన లక్షణాలలో ప్రతి పౌరుడికి ఎన్నికలలో పోటీ చేసే హక్కు ఒకటి. 2012లో ఎన్నికల సంఘం చేసిన సిఫారసుకు వ్యతిరేకంగా అటార్నీ జనరల్ తన అభిప్రాయాన్ని తెలియజేస్తూ ఒక వ్యక్తి సర్వీసులో ఉన్న కాలంలో స్వతంత్రత, తటస్థతను కొనసాగించడం సముచితంగా ఉంటుందని పేర్కొన్నారు.

> ఒక సీనియర్ అధికారి ప్రభుత్వ సర్వీసు నుంచి రిటైర్ అయిన తర్వాత కనీసం ఏడాది పాటు ప్రైవేటు ఉద్యోగంలో చేరకూడదని ప్రస్తుతం నిబంధనలు ఉన్నాయి. ప్రభుత్వంలో ఉన్నవారు ప్రైవేటు రంగంలో లాభసాటి ఉపాధి పొందకుండా నివారించేందుకు ఇలాంటి నియంత్రణలు వచ్చాయని అటార్నీ జనరల్ అభిప్రాయపడ్డారు. ఏదేమైనా, రాజ్యాంగ సూత్రాల కారణంగా ఎన్నికల్లో పోటీ చేసే అధికారులపై ఇటువంటి ఆంక్షలు చెల్లుబాటు అయ్యే పరిస్థితి రాకపోవచ్చు.

అటార్నీ జనరల్ అభిప్రాయం బలమైన న్యాయసూత్రంపై ఆధారపడినప్పటికీ, 'న్యాయం చేయడమే కాదు, చేసినట్టు కనిపించాలి' అనే ప్రసిద్ధ న్యాయ సూక్తిని గుర్తుంచుకోవడం కూడా అంతే అవసరం. ఇది న్యాయమూర్తులు, స్వతంత్ర రాజ్యాంగ అధికారులు, సీనియర్ బ్యూరోక్రాట్లకు సమానంగా వర్తిస్తుంది. వారి అధికారిక విధులను నిర్వర్తించేటప్పుడు ఇది ఒక అనివార్య లక్షణం. పదవి నుంచి వైదొలిగిన తర్వాత కూడా ఈ సూత్రాన్ని కొనసాగించడం సత్ఫలితాలను ఇస్తుంది. రాజకీయ పార్టీల్లో చేరడానికి లేదా ప్రభుత్వం ద్వారా రాజకీయ పదవులకు నామినేట్ కావడానికి కనీసం రెండేండ్ల కూలింగ్ పీరియడ్‌ను నిర్దేశించడం ద్వారా దీనిని సాధించవచ్చు. ఇది ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడమే కాకుండా క్విడ్ ప్రోకో ఆరోపణలను తోసిపుచ్చుతుంది.

దళితుల మద్దతు బీఆర్ఎస్‌కే

కేంద్రంలో అధికారం చేపట్టడమే ఏకైక ఎజెండాగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అడుగులు వేస్తున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దేశాన్ని అత్యధిక కాలం పాటు పాలించిన ఈ రెండు పార్టీలు సామాజిక సమానత్వాన్ని సాధించలేకపోయాయి. ఫలితంగా దేశంలో ఇప్పటికీ సామాజిక, రాజకీయ వివక్ష కొనసాగుతూనే ఉంది. మరోవైపు దళితులపై రోజురోజుకు దాడులు పెరిగి సామాజిక భద్రత కరవైంది. అధికారం కోసం కొత్త కొత్త నినాదాలు ఇస్తున్న రెండు జాతీయ పార్టీల లక్ష్యం ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి రాష్ట్ర ప్రభుత్వాలను ఇబ్బంది పెట్టడమే.

సంపత్ గడ్డం
78933 03516

అబద్ధాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేటికీ అవే అబద్ధాలు చెప్తూ కాలయాపన చేస్తున్నది. ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం.. ఒక్క పరీక్ష నిర్వహించకుండానే 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం విడ్డూరం. నియామకపత్రాలు ఇస్తూ గత ప్రభుత్వ ఘనతను తమ ఖాతాలో వేసుకోవాలని తాపత్రయ పడటం సిగ్గుచేటు.

కేసీఆర్, మోదీ ఒక్కటేనని పదేపదే ప్రచారం చేసే రేవంత్ రెడ్డి.. మోదీని పెద్దన్నగా పేర్కొనడాన్ని బట్టి వారి మధ్య ఉన్న బంధం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఏనాడూ తెలంగాణకు రూపాయి సాయం చేయని మోదీ సర్కార్.. రాష్ట్రంలో బలపడటానికే కాంగ్రెస్‌కు అంతర్గతంగా మద్దతు ఇస్తున్నదనే విషయం అందరికీ అర్థమవుతున్నది. నాడు రాహుల్‌గాంధీని బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలతో అవమానించినప్పుడు మొదటగా కేసీఆర్ ఖండించారు. కానీ, రాహుల్‌గాంధీని అవమానపరిచిన ఘటనను మరిచిన రేవంత్‌రెడ్డి.. నాడు బాసటగా నిలిచిన కేసీఆర్‌నే తిట్టడం విడ్డూరం.

రాష్ట్ర ప్రభుత్వాలను కూలుస్తూ.. పార్టీలను చీలుస్తూ బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నది. ఏక్‌నాథ్ షిండేలను తయారు చేస్తూ ప్రాంతీయ ఆకాంక్షలను విస్మరిస్తున్నది. అటువంటి బీజేపీకి రేవంత్‌రెడ్డి వంత పాడటం దేనికి సంకేతం. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన కూడా బీజేపీ పంచన చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అదే కనుక జరిగితే మరోసారి పరాయి పాలన కిందికి తెలంగాణ చేరినట్టే. ఆనాడు ఉమ్మడి పాలకులు మన వనరులను దోచుకున్నట్టే.. భవిష్యత్తులో గుజరాత్ వ్యాపారులు మన తెలంగాణను దోచుకోవడం ఖాయం. ఇప్పటికే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ చేరికతో బీఆర్ఎస్‌కు దళితుల మద్దతు మరింత పెరుగుతుందని ఆశించవచ్చు. తెలంగాణ హక్కులను కాపాడుకోవాలంటే మన ఇంటి పార్టీ బీఆర్ఎస్‌కే ఓటు వేయాలి.

ఎటమటం



గుడ్డి గుర్రాలా?

ఎంపీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తున్నామంటున్నారు. ఆ గెలుపు గుర్రాలు పార్టీలో లేవని పక్క పార్టీల నుంచి తెస్తున్నారా? మరి పార్టీలో ఉన్న వారు ఏమైనా గుడ్డి గుర్రాల వలె కనిపిస్తున్నారా? ఈ ప్రశ్న, కాంగ్రెస్ అంటే గిట్టని పార్టీ వారు అంటే పెద్దగా పట్టించుకోనవసరం లేదు. కానీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఏకంగా ఇదే ప్రశ్న వేస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాయడం పార్టీలో హాట్ టాపిక్.

కరుణించు స్వామి!

ఎన్నికల్లో అభ్యర్థులు తమను గెలిపించమని భగవంతుడిని ప్రార్థిస్తారు. గెలిచాక వెళ్లి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. కానీ, దానం నాగేందర్ మాత్రం దేవుడా నన్ను ఓడించి కాస్త పుణ్యం కట్టుకోమని వేడుకుంటున్నారట. ఎందుకంటే ఎంపీగా ఓడిపోతే హైదరాబాద్ కోటాలో మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ పెద్దలు హామీ ఇచ్చారట. దీంతో ఎంపీ పదవి కంటే మంత్రి పదవే బెటర్ అని ఆయనా, ఆయన సన్నిహితులు వేనోళ్ల మొక్కుకుంటున్నట్టు వినికిడి.



మరక మంచిదే

ఒక్కోసారి మరక కూడా మంచిదేనన్న ట్రెండ్ వర్తమాన రాజకీయాల్లో నడుస్తున్నది. నేను సీఎం రేసులో ఉన్నట్టు మీడియా రాస్తున్నది. కానీ, నాకు సీఎం కావాలని ఏ కోశానా లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మరీ స్పష్టం చేశారు. రేసులో లేకపోతే వదిలేయండి, లేనని చెప్పడానికి ప్రెస్ మీట్ ఎందుకని ఆయన సన్నిహిత జర్నలిస్టు మిత్రులన్నారట. గతంలో సీఎం రేసులో ఉన్నట్టు భట్టి, కోమటిరెడ్డి, ఉత్తమ్ పేర్లే మీడియా రాసేది. ఇప్పుడు ఆ జాబితాలో నన్ను కూడా చేర్చడంతో ఆ విషయం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లడం మంచిదే కదా అని సదరు అమాత్యులు ఎదురు ప్రశ్నించారట.

పవర్ గ్యారెంటీ

ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పక్షంలో చేరుతున్న నాయకులకు ఏం చెప్పాలో తెలియక ప్రజాపాలన కోసమని చెప్తున్నారు. 'ఈ నినాదమేమీ బాగాలేదు, మరీ పేలవంగా ఉంది. మరేదైనా కొత్తగా ట్రై చేయకూడదా?' అని కాంగ్రెస్ నాయకులే వారికి సూచిస్తున్నారట. గతంలో అయితే బంగారు తెలంగాణ కోసమని చెప్పేవాళ్లం.. ఇప్పుడు అలాంటి బలమైన నినాదమేమీ లేకపోవడంతో ఏం చెప్పాలో అర్థం కావడం లేదని వాపోతున్నారట. పోనీ గ్యారెంటీ హామీల కోసమని చెప్పకపోయారా? అంటే, పార్టీ గెలిచినా, ఓడినా... పవర్ గ్యారెంటీ అని నెటిజన్లు ట్రోల్ చేస్తారేమోనని సదరు నాయకుడు అనుమానం వ్యక్తం చేశారు.

- వెల్జాల